జూనియర్ కళాశాలలకు కొత్త రూపు


ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనానికి మరమ్మతులు


పూర్తయిన రేకుల షెడ్డు పైకప్పు ఆధునీకరణ పనులు

- ప్రభుత్వ కళాశాలకు రూ.1.09 కోట్లు మంజూరు
- చురుగ్గా ఆధునీకరణ పనులు

నిడదవోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. సీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు బాగా మెరుగుపడుతున్నాయి. ఇందులో భాగంగా నిడదవోలు పట్టణంలోని మునిసిపల్ పాఠశాలల్లో రెండో విడత నాడు–నేడు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అంతేగాకుండా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఆధునీకరణకు నోచుకుంటున్నాయి. రెండో విడత నాడు–నేడు పథకంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు రూ.1.09 కోట్లు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు రూ.78 లక్షలు మంజూరయ్యాయి.

శిథిలావస్థకు చేరిన కళాశాల భవనం

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని 1969లో నిర్మించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తరగతుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ కళాశాలలో హెచ్ఈసీ, ఎంపీసీ, సీఈసీ, బైపీసీ, సీఎస్ఈ, ఏఈటీ, ఈఈటీ కోర్సుల్లో మొత్తం 548 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ కళాశాల నూతన భవనంలో ఆరు తరగతులను నిర్వహిస్తున్నారు. పురాతన భవనంలోని ఐదు తరగతి గదుల్లో, ల్యాబ్‌లకు వినియోగిస్తున్న ఎనిమిది గదుల్లో సదుపాయాలు కొరవడ్డాయి. దాంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాత భవనం శ్లాబ్ నుంచి వర్షపు నీరు లీకవుతోంది. వర్షం కురిసినపుడల్లా తరగతి గదులన్నీ తడిసిపోతున్నారు. ల్యాబ్‌లలోని సైన్స్ పరికరాలు తడిసిపోతున్నాయి. ప్రస్తుతం పాత భవనం పై శ్లాబ్ తొలగించే పనులు చురుగ్గా జరుగుతన్నారు. రేకుల షెడ్డు తరగతి గదులు ఆరు ఉన్నాయి. వాటి పైకప్పును పూర్తిగా తొలగించి రూఫింగ్ సీట్స్‌తో ఇప్పటికే నిర్మించారు. ఈ కళాశాల్లో పది మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు ఉండడంతో అవి సరిపోవడం లేదు. ఇప్పుడు అదనంగా మరో 10 మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. కళాశాల మొత్తం గ్రానైట్ రాళ్లతో ఫ్లోరింగ్ చేస్తారు. వర్షాలకు కూలిన ప్రహరీని పునర్నిర్మించారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, డిజిటల్ తరగతులు, కొత్తగా విద్యుత్ లైన్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. భవనాలకు రంగులు వేస్తున్నారు. సురక్షిత తాగునీటిని అందించే ఆర్వో ప్లాంట్ పనులు కూడా జరుగుతున్నాయి.


నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు

30 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు



54 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో శిథిలావస్థకు చేరింది. 30 ఏళ్లుగా శిథిల భవనాన్ని ఎవరూ పట్టించుకోలేదు. నాడు–నేడు రెండో విడతలో భాగంగా కళాశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.1.09 కోట్లు కేటాయించడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాం. కళాశాలకు అభివృద్ధికి నిధులు కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు చెబుతున్నారు.నిడదవోలు పరిసర ప్రాంతాల విద్యార్థులు ఇక్కడికే వస్తారు.

–బి. మేరీ సుజాత, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నిడదవోలు

క్లుప్తంగా

నేటి నుంచి వేలివెన్ను ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు

ఉండ్రాజవరం: శశిధర్ మెమోరియల్ సంక్రాంతి–2023 సంబరాల్లో భాగంగా మండలంలోని వేలివెన్ను శశి విద్యాసంస్థల ప్రాంగణంలో బుధవారం నుంచి వేలివెన్ను ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు ప్రారంభం అవుతాయని కమిటీ కన్వీనర్ బూరుగుపల్లి శ్రీనివాసు మంగళవారం తెలిపారు. ఈ నెల 14 వరకూ కొనసాగే ఈ ప్రీమియర్ లీగ్‌లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. 14న ఫైనల్స్, 15న బహుమతుల ప్రదానం జరుగుతాయన్నారు. క్రికెట్‌లో విన్నర్స్ జట్టుకు రూ.10 వేలు, రన్నర్ జట్టుకు రూ.6 వేలు, కబడ్డీలో విన్నర్స్ జట్టుకు రూ.7 వేలు, రన్నర్ జట్టుకు రూ.3,500, వాలీబాల్‌లో విన్నర్స్ జట్టుకు రూ.6 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.3 వేల నగదు బహుమతులు ఇస్తామన్నారు. వివరాలకు కె.సోము సెల్ 93472 77254, పి.ప్రశాంత్ సెల్ 96187 66221, కె.వివేక్ సెల్ 93475 56292 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్యవైశ్య సంఘం దొండపూడి శాఖ కార్యవర్గం ఎన్నిక

గోపాలపురం: ఆర్యవైశ్య సంఘం దొండపూడి శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బొమ్మా వెంకటరమణ, అధ్యక్షుడిగా సబ్బిశెట్టి కుమార శ్రేష్టి, ఉపాధ్యక్షుడిగా మద్దుల మోహన్, కార్యదర్శిగా గోకవరపు నాగు, సంయుక్త కార్యదర్శిగా బొమ్మా రాజేష్, కోశాధికారిగా నగరగంటి రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు కొవ్వూరులో పింఛన్ల పెంపు వారోత్సవ సభ

కొవ్వూరు: పింఛన్ల పెంపు వారోత్సవాల నియోజకవర్గ స్థాయి సభను బుధవారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.ప్రసన్నకుమార్ తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు తెలిపారు.నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన పింఛన్లను, పెరిగిన పింఛన్ల సొమ్మును మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నట్టు ఎంపీడీవో వివరించారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: మండలానికి కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరశర్మ మంగళవారం తెలిపారు. మండలానికి కొత్తగా 319 పింఛన్లు మంజూరైనట్టు చెప్పారు. జనవరి నుంచి పింఛన్ సొమ్ము రూ.2750 చొప్పున వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు.

గుండె పోటుతో వీఆర్వో మృతి


ఎస్‌కె మాబూ స్వానీ (ఫైల్)

గోపాలపురం: మండలంలోని వెంకటాయపాలెం వీఆర్వో ఎస్‌కే మాబూ స్వానీ (54) మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. భూముల రీ సర్వే విషయమై రైతులకు అవగాహన కల్పించేందుకు వెళుతుండగా ఒక్కసారిగా ఆయనకు గుండె నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను గోపాలపురం సీహెచ్‌సీకి తీసుకు వెళ్లారు. అక్కడ ఈసీజీ తీసిన డాక్టర్లు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించాలని సూచించారు. మాబూ స్వానీని రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. ఆయన భౌతికకాయాన్ని తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, వీఆర్వోలు, వీఆర్ఏలు సందర్శించి నివాళులు అర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రాజమహేంద్రి పోదాం.. జగన్ ప్రసంగం విందాం

- ముఖ్యమంత్రి బహిరంగ సభకు భారీగా తరలిన జనం
- బస్సులు, వాహనాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, లబ్ధిదారుల పయనం

సాక్షి, న్యూస్ నెట్‌వర్క్: ఉరికే ఉత్సాహంతో పయనమయ్యారు. రాజమహేంద్రవరంలోని ఆర్ట్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి భారీగా పింఛనుదారులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. కొవ్వూరు పట్టణం, మండలం నుంచి 124 బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో ఉత్సాహగా తరలి వెళ్లారు. నిడదవోలు నుంచి ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు వివిధ వాహనాల్లో తరలి వెళ్లారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు రాజమహేంద్రవరం వెళ్లిన వారిలో ఉన్నారు.

నిడదవోలు మండలం నుంచి 21 బస్సులు, 60 కార్లు, బైక్‌లపై సీఎం సభకు కదిలి వెళ్లారు. సమిశ్రగూడెంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, తాడిమళ్లలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, తిమ్మరాజుపాలెంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు పార్టీ జెండాలు ఊపి వాహనాలను ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు. గోపాలపురం మండలం వాదాలకుంట నుంచి ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ, దొండపూడిలో పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు సారథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో పార్టీ శ్రేణులు,లబ్ధిదారులు రాజమహేంద్రవరం వెళ్లారు. నల్లజర్ల మండలం ఆవపాడు నుంచి వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీరావు ఆధ్వర్యంలో భారీగా మహిళలు రాజమహేంద్రికి పయనమయ్యారు. పుల్లలపాడు, ముసుళ్లగుంట గ్రామాల నుంచి పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాడిగడప శ్రీనివాసరావు నాయకత్వంలో రైతులు పయనమయ్యారు.ఎంపీపీ బంక జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

చాగల్లు మండలం నుంచి 18 బస్సులు, ఇతర వాహనాల్లో తరలి వెళ్లారు. చాగల్లు నుంచి పార్టీ మండలశాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ఆత్మ చైర్మన్ గంగ్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. మార్కొండపాడు నుంచి ఎంపీపీ మట్టా వీరాస్వామి ఆధ్వర్యంలోను, బ్రాహ్మణగూడెం నుంచి సొసైటీ అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. తాళ్లపూడి మండలం నుంచి పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, పలువురు సర్పంచుల ఆధ్వర్యంలో సీఎం జగన్ బహిరంగ సభకు వాహనాల్లో తరలి వెళ్లారు. పెరవలి మండలం నుంచి 15 బస్సుల్లో కార్యకర్తలు, లబ్ధిదారులు బయలుదేరి వెళ్లారు.అలాగే 40 కార్లు, 100 మోటార్ సైకిళ్లపై నాయకులు, కార్యకర్తలు వెళ్ళారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు దేవరపు శ్రీహరి, తదితరులు రాజమహేంద్రవరం వెళ్లిన వారిలో ఉన్నారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద బస్సులకు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గం నుంచి సుమారు 100 బస్సుల్లో లబ్ధిదారులు తరలి వెళ్లినట్టు తెలిపారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు, నియోజకవర్గ మహిళా కన్వీనర్ ఆచంట అనసూయ, దేవరపల్లి, ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాల పార్టీ అధ్యక్షులు కూచపూడి సతీష్, ప్రతాపనేని వాసు, గగ్గర శ్రీనివాస్ సీఎం సభకు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.


బస్సులో వెళుతున్న లబ్ధిదారులతో మాట్లాడుతున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు


పెరవలి మండలం ఖండవల్లి నుంచి..


దేవరపల్లిలో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ఆత్మీయ నేతకు స్వాగతం





రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయినకు రాష్ట్ర హోం మంత్రి తానేతి వనిత, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆత్మీయ స్వాగతం పలికారు.

చాగల్లులో అన్న సమారాధన

చాగల్లు: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని చాగల్లులోని శెట్టిబలిజ రామాలయ ప్రాంగణంలో మంగళవారం అన్న సమారాధన నిర్వహిచారు. చాగల్లు, నెలటూరు, మీనానగరం పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

ఉండ్రాజవరం: క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలని పీహెచ్‌సీ వైద్యులు రాజనాల ప్రసాద్ అన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వసుంధర ఆదేశాల మేరకు ఉండ్రాజవరం పీహెచ్‌సీలో మంగళవారం ఆశా, ఏఎన్ఎం కార్యకర్తలకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు, క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారికీ నిర్ధారణ పరీక్షలు చేయించాలని సూచించారు. క్షయ రోగులు తీసుకునే మందులు ఆపకుండా ఉండాలని, ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని సంప్రదించాలని కోరారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్న ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవ్వరైనా దగ్గు, జ్వరం, కళ్లె పడడం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం ఆశ కార్యకర్తల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ వి.ఆశాజ్యోతి హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

వరలక్ష్మికి సావిత్రీబాయి పూలే ఎక్స్‌లెన్స్–2023 అవార్డు


అవార్డు అందుకుంటున్న వరలక్ష్మి

తాళ్లపూడి: సావిత్రీబాయి పూలే ఎక్స్‌లెన్స్–2023 అవార్డును మండలంలోని బల్లిపాడు జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు గూడపాటి వరలక్ష్మి మంగళవారం అందుకున్నారు. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహాత్మా జ్యోతిరావు పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో వరలక్ష్మి ఈ అవార్డు స్వీకరించారు. తెలంగాణ గవర్నర్ తమిళ సై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వరలక్ష్మిని ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. కాగా వరలక్ష్మి స్వస్థలం మండలంలోని వేగేశ్వరపురం.

గోష్పాదేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన


కొవ్వూరులో ప్రత్యేకాలంకరణలో గోష్పాదేశ్వరస్వామి వారు

కొవ్వూరు: స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి పూజలను పర్యవేక్షించారు. సాయంత్రం స్వామి వారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో కోలాటం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని రిజిస్టర్‌లో నమోదు చేయాలి

నిడదవోలు రూరల్: స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ ఎం.గంగరాజు సూచించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో స్పందనలో వచ్చే అర్జీలను సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. పింఛన్లు, రేషన్, ఆరోగ్య శ్రీ కార్డుల జారీలో ఇబ్బందులుంటే సంబంధిత సచివాలయం దృష్టికి తీసుకు వెళ్తే తగిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.మూర్తిబాబు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ..

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- సత్యవాడలో సమస్యలపై ఆరా

ఉండ్రాజవరం: ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని సత్యవాడలో సర్పంచ్ ఇందుకూరి దేవీభార్గవి ఆధ్వర్యంలో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరించే బుక్‌లెట్లు అందజేశారు. ఏమ్మా! బాగున్నారా? ప్రభుత్వం పథకాలు అందుతున్నాయా? వలంటీర్లు, సచివాలయాల పనితీరు ఎలా ఉంది? అంటూ ప్రజలను పలకరించారు. సమస్యలపై ఆరా తీశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు గల వ్యత్యాసాన్ని గుర్తించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. చంద్రబాబు హయంలో సంక్షేమ పథకం పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగవలసి వచ్చేదని, జగనన్న పాలనలో లబ్ధిదారులను వెతుక్కుంటూ పథకాలు వస్తున్నాయన్నారు. అనంతరం ఓటీఎస్ లబ్ధిదారులకు ఆయన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐవీఎస్ రాజు, పెనుమత్స సుబ్బరాజు, ఎస్. శ్రీనివాసరాజు, టి.రాము, జి.లక్షణ్, ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.


సత్యవాడలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

నిడదవోలు: సావిత్రీబాయి పూలే జయంతిని పట్టణంలో ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. మహిళా సాధికారిత విభాగం కో–ఆర్డినేటర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు అధ్యాపకులు సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకురాలు పి.ఉషారాణి మాట్లాడుతూ సమాజంలో మహిళలు చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరకోగలుగుతున్నారంటే దానికి ఆద్యురాలు సావిత్రీబాయి పూలే అని కొనియాడారు.

తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఖ్యాతి

కొవ్వూరు: మహిళా విద్యను ప్రోత్సహించాలన్న సంకల్పంతో బాలికల చదువు కోసం పాఠశాలను ప్రారంభించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీ బాయి పూలే ఖ్యాతి గడించారని బీసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతా కృష్ణారావు అన్నారు. పట్టణంలోని బాపూజీ నగర్‌లో సావిత్రీ బాయి పూలే జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సేన నాయకులు ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.భర్త జ్యోతిరావు పూలే సహకారంతో సత్య శోధక్ అనే సమాజాన్ని స్థాపించి బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని వక్తలు కొనియాడారు. బీసీసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు, సంఘ నాయకులు బొర్రా కృష్ణారావు, మారిశెట్టి సత్తిబాబు, కోమలి కనక దుర్గరావు, వీరమళ్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో సావిత్రీ బాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు